క్లుప్తంగా

ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన



వనసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆర్యవైశ్యుల కార్తీక వనస మారాధన కార్యక్రమం పేరుపాలెం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో నరసాపురం మండల, పట్టణ, మొగ ల్తూరు మండలాల్లోని పలు గ్రామాల నుంచి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యా, వ్యాపార, సేవా రంగాల్లో ఆర్య వైశ్యులు ముందుండాలన్నారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజ చేసి సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆట పాటలతో హాజరైనవారంతా ఉల్లాసంగా గడిపారు.

పెట్రోలు బంకులో తనిఖీలు



పెట్రోలు బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని పలు పెట్రోలు బంకుల్లో ఏకకాలంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏలూరు జిల్లా అసి స్టెంట్ కమిషనర్ బోణం సాయిరామ్ ఆధ్వర్యంలో ఏడు బృందాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, మొగల్తూరు పాలకొల్లు, నరసాపురం పెట్రోలు బంకుల్లో తనిఖీలు నిర్వహించి ఒక కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో తాడేపల్లిగుడెం, అమ లాపురం ఇన్స్పెక్టర్లు అప్పల నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకున్న విద్యార్థులతో అధికారులు

నరసాపురం రూరల్: ఏపీ స్టేట్ ఎయిడ్స్ కం ట్రోల్ సొసైటీ, నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో మీ ఆరోగ్య స్థితి మీకు తెలుసా? అనే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వైఎస్ కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. హెల్త్ కౌన్సిలర్ జి.జేసు ప్రసాదబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ, సుఖ వ్యాధుల స్థితిని పరీక్షల ద్వారా తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఎయిడ్స్, సుఖవ్యాధులు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాల న్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నవీన్‌కుమార్, ఏసుపాదం, వైఎస్ కళాశాల నర్సింగ్ హెచ్ఓడీ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్లు జాకబ్, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ చిత్రకారులకు అవార్డుల పంట

పాలకొల్లు సెంట్రల్: ఒంగోలులో సృష్టి ఆర్ట్ అకాడమి నిర్వహించిన జాతీయ స్థాయి పెయిం టింగ్ పోటీల్లో పాలకొల్లుకు చెందిన చిత్రకారులు అనేక అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భం గా గురువారం చిత్రకారులు మాట్లాడుతూ ప్రాచీన భారతం అనే అంశంపై జరిగిన పోటీల్లో తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన చిత్ర కారులు సుమారు వంద మంది వరకూ పాల్గొన్నారన్నారు. ఇందులో పట్టణానికి చెందిన కడలి శ్రీనివాస్, కొసనా భాస్కర్, నక్కా వెంకట్, ఎస్‌కెడీ రవి, రమ్య రాము తదితరులు అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. అవార్డులను పొందిన వారిని పట్టణంలోని ఆర్ట్ అకాడమి సభ్యులు అభి నందించారు.

వీఓఏ కాలపరిమితి జీఓ రద్దు చేయాలి

నరసాపురం రూరల్: ఇందిరా క్రాంతి పథంలో పని చేస్తున్న వీఓఏ కాలపరిమితి జీఓను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద ఆం దోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనా రాయణ మాట్లాడుతూ డ్వాక్రా గ్రామ సంఘాల నిర్వహణ సహాయకులకు ప్రభుత్వం కాల పరిమితి జీఓను విడుదల చేసిందని ఈ జీఓ వారి పని విధానాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తుంద న్నారు. వీరికి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు అనంతరం వినతి పత్రాన్ని ఏపీఎం ప్రభుదాస్‌కు అందించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో గురువారం కోడిపందాలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుం చి ఒక కోడి పుంజు, ఒక కోడి కత్తి, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ ఎస్సై సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్‌మైన అవస్థలు

- అపార్ ఐడీ జనరేట్ చేయాలని విద్యాశాఖ ఆదేశాలు
- ఆధార్ కార్డుల్లో తప్పులను సరిదిద్దేందుకు ఆధార్ కేంద్రాలకు క్యూ



యూనియన్ బ్యాంకు వద్ద ఆధార్ కార్డుల్లోని తప్పులు సరిచేయించుకునేందుకు క్యూ కట్టిన ప్రజలు (ఫైల్)

నరసాపురం రూరల్: జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా ఆధార్ కార్డు తరహాలో విద్యా ర్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేం ద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఒకే దేశం-ఒకే విద్యార్థి అనే నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ కేటా యించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించిం ది. విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులకు ఈ నంబర్ కేటాయించనున్నారు.

సవరణ లేకపోవడమే ఇబ్బంది

అపార్ నెంబర్ కలిగి ఉండడం ద్వారా దేశంలో ఎక్కడైనా విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. ఒకసారి కార్డు జారీ అయితే సవరణలకు నో చాన్స్, ఇప్పటికే అపార్ నమోదు కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోంది. అయితే ఆచరణలో ఇందుకు విరుద్ధంగా దిగువ స్థాయిలో ఉంది. విద్యార్థులు జనన ధృవపత్రాలు, ఆధార్ ధ్రువ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫోటో, తల్లిదండ్రుల ఆధార్ నకలు తదితర సర్టిఫికెట్‌లు అపార్ నమో దుకు కావాలని ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అంతే కాకుండా పైన పేర్కొన్న ధ్రువపత్రాల్లో ఏ చిన్న పొర పాటు ఉన్నా విద్యార్థికి అపార్ నెంబరు రాదని ఖరాఖండిగా చెబుతున్నారు. ఆయా పత్రాలను వేగంగా తీసుకురావాలని ఉపాధ్యాయులు తేల్చిచె ప్పడం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా తయారైంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం తాత్కాలిక ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకుంటుంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆధార్, జనన ధ్రువ పత్రాల్లోని తప్పొప్పులను ఏడాది మొత్తం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండేలా ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నరసాపురంలో పాఠశాల, విద్యార్థుల వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు	105
ప్రాథమికోన్నత పాఠశాలలు	12
ఉన్నత పాఠశాలలు	41
ఇంటర్మీడియట్ కళాశాలలు	14
1 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు	26,266

జీవితకాలం ఉపయోగపడుతుంది

ఆధార్ నెంబర్ మాదిరిగానే ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ జనరేట్ అవుతుంది. విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా అపార్ ఐడీ ఉపయోగ పడనుంది. అపార్ కార్డు ఒకసారి జారీ అయితే ప్రస్తుతానికి సవరణకు అవకాశం లేదు. అందు వల్ల నమోదు విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నాం. విద్యార్థి పేరు, తదితర వివరాల్లో ఏమైనా తప్పొప్పులు ఉం టే వెంటనే ఆధార్ సెంటర్‌కు వెళ్లి సరిచేసుకో వాలి. ముఖ్యంగా ఈ విషయంలో తల్లిదం డ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నరసాపురం మండలంలో 58 శాతం అపార్ వివరాలు నమోదు పూర్తయ్యింది.

– జాన్ ప్రభాకర్, ఎంఈఓ-2, నరసాపురం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం రూరల్: స్థానిక ద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తు న్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చెట్ల కొమ్మలు తొలగింపు దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకూ యర్రంశెట్టివారిపాలెం, పితానిమెరక, లక్ష్మణే శ్వరం, సారవ, రాజుల్లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ కె.మధు కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు పట్టణ ప్రాంతంలో ఫీడర్ 1, రాజీవ్ నగర్ ఫీడర్, పాల కొల్లు మండలంలో 33-11 కెవి లంకలకోడేరు సబ్ స్టేషన్, లంకలకోడేరు లోకల్ ఫీడర్స్ మరమ్మతులు చేసేందుకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలు పుదల చేయనున్నామని పేర్కొన్నారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు, పెదగోపురం, టెలిఫోన్ ఎక్స్చేంజ్, యూనియన్ బ్యాంకు, లాక్‌డౌన్‌లో బీఆర్ఎంవీ స్కూల్, రామారావు పేట, ఎల్ఆర్ పేట ప్రాంతాల్లో, అలాగే మండలంలో లంకలకోడేరు, బల్లిపాడు, ఎస్ చిక్కాల, దగ్గులూరు, వెంకటాపురం, గవరపేట, పాలమూరు, అరట్లకట్ట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని పేర్కొన్నారు.

యలమంచిలిలో..,

యలమంచిలి: మండలంలోని యలమంచిలి, ఇలపకుర్రు, కాజ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సాంకేతిక మరమ్మతుల కారణంగా శుక్ర వారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తు న్నట్లు నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. వినియోగదారులు సహకరిం చాలని ఆయన కోరారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు

నరసాపురం రూరల్: బాకీ చెల్లించాలని లేకుంటే చం పుతామని బెదిరించడంతో ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మొగ ల్తూరు ఎస్సై జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం కోమటితిప్ప గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర రావు రామన్న పాలేనికి చెందిన వ్యక్తికి బాకీ ఉన్నాడని ఆ బాకీ తీర్చాలని లేకుంటే చంపుతామని గట్టిం ముత్యాలరావు, మరో ఐదుగురు వ్యక్తులు బెదిరిం చారు. అంతేకాకుండా తన ఇంటికి వచ్చి దౌర్జన్యానికి దిగాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం



పాలకొల్లు అర్బన్: అరట్లకట్టలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మొగల్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది



పాలకొల్లు సెంట్రల్: సమావేశంలో కాపు వనిత క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ విధమైన అనుమానం కలిగినా వెంటనే పరీక్షలు చేయించుకుని క్యాన్సర్ నుంచి విముక్తి పొందాలని డాక్టర్ ఎం.నవ్యజీవన్ కోరారు. జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమం లో భాగంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం వద్ద నవ్యజీవన్ ఆధ్వర్యంలోనూ, అలాగే అరట్లకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులో మెడికల్ ఆఫీసర్ సత్యసౌ జన్య ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ అవగా హన శిబిరాలు నిర్వహించారు. పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలు, క్యాన్సర్ వ్యాధి లక్ష ణాలను వివరించారు. క్యాన్సర్‌పై విజయం....స్క్రీనింగ్‌ తో సాధ్యం నినాదంతో ఈ నెల 14 నుంచి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మూర్తిరాజు, సచివాలయ కార్యదర్శి దిడ్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగా హన కల్పించుకోవాలని డాక్టర్ దినేష్ సూచించారు. గురువారం మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ మాట్లాడుతూ 18 సంవ త్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిమని వివరించారు.

కోకోనట్ కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో ఉన్న బిజీ జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధగా కనభరచాలని డాక్టర్ ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కోకోనట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యం లో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా డాక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ బి. అప్పారావు, క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, చైర్‌పర్సన్ మంగిన అరుణ, క్లబ్ అధ్యక్షురాలు యామన విజయ, సెక్రటరీ దేవరపు కాంచనమాల, టెర్జరర్ శిద్దిరెడ్డి శైలజారాణి తదిత రులు పాల్గొన్నారు.

లైఫ్ సైన్స్ విద్యార్థులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: లైఫ్ సైన్స్ విద్యార్థులకు ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, గ్రోవెల్ కంపెనీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో సదస్సులో కంపెనీ రీజనల్ మేనేజరు కేఎంఎం రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ స్వాతీ శ్రీ నాయక్, యాప్ డెవలపర్ రవి పాల్గొని విద్యార్థులకు అవగా హన కల్పించినట్లు తెలిపారు. గ్రోవెల్ కంపెనీ అం దిస్తున్న అవకాశాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై విద్యార్థు లకు వివరించారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి తాడి రమేష్, జువాలజీ పీజీ విభాగా ధిపతి యడీవీ పుల్లారావు, జువాలజీ విభాగా ధిపతి డాక్టర్ కె.లక్ష్మీ కాంతమ్మ, బోటనీ విభాగా ధిపతి కె.శ్రీలక్ష్మీ, టి.దివాకర్, టి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మహిళల ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కేజీఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సి పాల్ ఎస్ సురేష్ చంద్రజీ అన్నారు. వసుధ ఫౌండే షన్ ఆధ్వర్యంలో పోడూరు మండలం జిన్నూరులో 80 మంది మహిళలకు మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరం ముగింపు కార్య క్రమంలో భాగంగా గురువారం పెన్మెత్స బాపిరా జు-అనసూయ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రామకోటిరాజు, రామచంద్రరాజు ఆర్థిక సహాయంతో 12 మంది మహిళలకు సబ్సిడీపై కుట్టు మెషీన్లు అందజేశారు. వసుధ ఫౌం డేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు చేస్తున్న కృ షిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, క్షత్రియ సేవా సమితి కార్యదర్శి భూపతిరాజు సూరపరాజు, ట్రైనర్ బి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో దేవాంగులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న దేవాంగ సంఘు సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపిణీలో దేవాంగులకు అన్యాయం చేశారని సం ఘ గౌరవ అధ్యక్షుడు వి.గణేష్ అన్నారు. గురు వారం స్థానిక వీవర్స్ కమ్యూనిటీ హాలు నందు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత జనాభాలో సుమారు 16 లక్షలు పైబడి దేవాంగులు ఉన్నార న్నారు. కేవలం ఒకే ఒక చేనేత వర్గానికి చెందిన వారికి పదవి ఇచ్చి మిగిలిన వారికి అన్యాయం చేశా రన్నారు. గతంలో చేసినట్లు దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అలాగే ఎమ్మెల్సీ, ముఖ్యమైన దేవస్థానాలతో పాటు ఇతర నామినేటెడ్ పదవులు జనాభా ప్రాతిపదికన సముచిత స్థానం కల్పించే విధంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కూర్మా శివగణేష్, సెక్రటరీ మానెం బసవరాజు, బాసిన సత్యనారాయణ, యర్రా శివాజీ, బాసిన గుణేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన



ఎస్‌హెచ్‌జీ యాప్‌ను వివరిస్తున్న లక్ష్మీపార్వతి

పాలకొల్లు సెంట్రల్: స్వయం సహాయక సంఘా లకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్ హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో నమోదు చేయాలని మెప్మా ఐబీ స్పెషలిస్ట్ జీఎల్ లక్ష్మీపార్వతి అన్నారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా భవనంలో పాలకొల్లు, నరసాపురం అర్బన్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్‌లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలిం గ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి మాట్లాడుతూ మెప్మాలో ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన సమా చారం ఆన్‌లైన్‌లో లేదని అన్నారు. మిషన్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం ఎస్‌హెచ్‌జీ యాప్‌లో మొత్తం సమాచారాన్ని నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్ర మాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో మెప్మా సీఎంఎం ఎస్.రత్నాకర్, సీహెచ్ నానిబాబు, సీహెచ్ మోహన్, కృష్ణ ప్రసాద్, సునేత్ర, రాధాదేవి, సత్యనారాయణ షణ్ముకదేవి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో పర్యావరణ పరిరక్షణ కీలకం



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ దుర్గా కిషోర్

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుత మానవ జీవితంలో పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత కీలకమైన అంశమని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. గురువారం స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో తల్లి కోసం మొక్కలు నాటే (ఏక్ పెడ్ మాకీ నామ్) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గా కిషోర్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం వల్ల గ్లోబల్ వార్మింగ్ జరిగి వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయన్నారు. తద్వారా కాలాలు సరైన కాలానికి సక్రమంగా రావడంలేదన్నారు. అందు వల్ల ప్రతి విద్యార్థీ పర్యావరణ పరిరక్షణలో భాగం గా మొక్కలను నాటుతూ వాటి సంరక్షణ కూడా అంతే బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేత లైన షేక్ మొబీనా, కె.మౌనిక, సీహెచ్ తిరుమల శ్రీనిజ, హారిక, శివసుబ్రహ్మణ్యం, బి.తనుషాలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ కేంద్ర యువజన క్రీడా శాఖ కోఆర్డినే టర్ కె.రాజేష్, కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వ రరావు, డాక్టర్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారా మారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాధా మాధవి పాల్గొన్నారు.

వృద్ధురాలికి గ్యాస్ బుక్, బాండ్ అందజేత

మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన ఓ వృ ద్ధురాలికి గ్యాస్ సిలెండర్ ఉన్నా గ్యాస్ బుక్, బాండ్ లేక గత 12 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. శుక్ర వారం దీపం-2 పథకంలో భాగంగా ఆ వృద్ధురా లికి కొత్త గ్యాస్ కనెక్షన్‌తో పాటు గ్యాస్ బుక్, బాం డ్, రెగ్యులేటర్‌లను తహశీల్దార్ దుర్గా కిషోర్ అంద జేశారు. సీఎస్‌డీటీ జి.నరేష్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి పాలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఆకర్షణకు లోనైతే జీవితం నాశనమే



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: నేటి యువత డ్రగ్స్‌కు బాగా ఎడిక్ట్ అవుతున్నారని ఒక్కసారి ఆ రొంపిలో దిగితే జీవితం నాశనమైనట్లేనని పాలకొల్లు రూరల్ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా వయస్సు అంటే ఆకర్షణీయమైన టీనేజ్ అని అన్నారు. ఆ సయమంలో ప్రతీ విద్యార్థి ఏకాగ్రతతో మెలగాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు కాకుండా కెరీర్ గైడ్ వైపు మాత్రమే దృష్టి కేంద్రీకరించాలన్నారు. మనిషి జీవితం నాశనం చేసుకోవడానికి ఒక్క నిమిషం సరిపోతుందని అదే బాగుచేసుకోవాలంటే చాలా కష్టపడాలని అన్నారు. ఏదైనా తప్పు చేసేట ప్పుడు ఒక్కసారి మీ జీవితం అలాగే మీ కుటుంబం గురించి ఆలోచిస్తే మన కోసం మన తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో అర్థమవుతుందన్నారు. డ్రగ్స్ అవగాహన, పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అం దజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వ రి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు పంపిణీ

పెనుగొండ: మండలంలోని ఆచంట వేమవరం సొసైటీ వద్ద గురువారం బ్రోమోడయలిన్ కలిపిన విషపు ఎరను రైతులకు అందించారు. కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు, సర్పంచ్ జక్కంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెనుమంట్ర: మండలంలోని అన్ని గ్రామాలలో రైతుసేవా కేంద్రాలను గురు వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భం గా మండల వ్యవసాయశాఖాధికారిణి ఎ.జోష్నల మాట్లాడుతూ ప్రతి రైతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు సకాలంలో సొమ్ములు పొందాలని అన్నారు. ధాన్యం కామన్ వెరైటీ క్విం టాల్‌కు రూ 2,300లు, ఏ గ్రేడ్‌రకం రూ. 2,320లు ప్రభుత్వ ధరగా నిర్ణయిం చారని, రైతులు తేమ శాతాన్ని పరీక్షించుకుని ధాన్యం కొనుగోలు సిబ్బంది సూచనలు పాటించాలని ఆమె సూచించారు. ప్రతి కేంద్రం వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా శిశు రక్షణ దినోత్సవం

నరసాపురం రూరల్: శిశు మరణాలను తగ్గించడమే శిశు రక్షణ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని న్యాయ సేవా కమిటీ సభ్యుడు ఫణికర్ అన్నారు. గురువారం శిశు రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం మం డల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ అంగన్‌వాడీ సెంటర్లో అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు, గర్భిణులకు నిర్వహించిన శిశువుల రక్షణ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఫణికర్, న్యాయవాది కె.చిట్టి పద్మజ మాట్లాడుతూ స్త్రీలు గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు మూడు సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ బిడ్డ యోగక్షేమాలు, ఆరోగ్యం మెదలైనవి బాధ్యతగా పట్టించుకోవాలని అవగా హన కల్పించారు.